క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన

ఉండవెల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్‌సర్కిల్‌లో ఎస్‌ఐ మహేష్ ఆధ్వర్యంలో పోలీస్ కళా బృందం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, బాల్య వివాహం, మొబైల్‌లో మోసపూరిత మెసేజ్‌లు, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ కళా బృందం సభ్యులు, ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో పూడికతీత



అయిజ: నెట్టెంపాడు ప్రాజెక్ట్‌లో భాగంగా తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగుదొడ్డి చెరువుకు నీటి సరఫరా చేసే కాలువలో ముళ్ల పొదలు, గడ్డి, బురద పేరుకుపోయింది. శుక్రవారం పట్టణానికి చెందిన రైతులు ఈరన్న, రామకృష్ణ, రాముడు, తాయప్పలు బింగుదొడ్డి చెరువు కాలువలో సొంత ఖర్చులతో పూడిక తీయించారు. పూడికతో కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా మారిందని, దీంతో తాటికుంట రిజర్వాయర్ నుంచి తప్పెట్ల మోర్సు, దేవబండ మీదుగా బింగుదొడ్డి చెరువు వరకు నిర్మించిన కాలువకు పూడికతీత పనులు చేపట్టినట్లు వారు తెలిపారు.

కులం పేరుతో దూషణ.. కేసు నమోదు

ఉండవెల్లి : కులం పేరుతో దూషించినందుకు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు శివారులోని 2 ఎకరాల్లో భూమిని కొనుగోలు చేసిన వడ్డేపల్లి మండలం జిల్లెడుదిన్నె గ్రామానికి చెందిన కాశపోగు రాజును స్థలం వద్ద అశోక్ కుమార్, మురళి, నాగేశ్వర్ రెడ్డి, కామేశ్వర్ సింగ్, రఘువీర్ సింగ్ కులం పేరుతో దూషించినట్లు రాజు తెలిపారు. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ పేర్కొన్నారు.

బాధితుడికి పరామర్శ

మల్దకల్ : మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన లోట తిమ్మప్ప అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత శుక్రవారం తిమ్మప్పను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, ఆంజనేయులు, అయ్యన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

అయిజ: తిక్కవీరేశ్వర స్వామి జాతర సందర్భంగా మండల కేంద్రంలో వారం రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. మొదటి బహుమతి ఎంఎం డీజే టీం కైవసం చేసుకుంది. అదే విధంగా ఎస్‌ఎన్‌ఆర్ టీం రెండో బహుమతి గెలుచుకుంది. నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉపాధ్యాయురాలి తొలగింపు

అయిజ: విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయురాలిని విధుల నుంచి తొలగించాలని పాఠశాల యాజమాన్యానికి డీఈఓ కార్యాలయం నుంచి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. మండల కేంద్రంలోని కృష్ణవేణి ప్రైవేటు పాఠశాలలో బుధవారం 2వ తరగతి చదువుతున్న విద్యార్థి విరాట్ శంకర్ నాయక్‌ను ఉపాధ్యాయురాలు మానస కొట్టడంతో శరీరంపై వాతలు పడిన విషయం తెలిసిందే. అయితే ఉపాధ్యాయురాలిని పాఠశాల నుంచి తొలగించడంతోపాటు విద్యార్థికి అయ్యే వైద్య ఖర్చులు మొత్తం పాఠశాల యాజమాన్యం భరించాలని డీఈఓ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేశారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

మానవపాడు : ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. మండలంలోని బోరవెల్లి పాఠశాలను శుక్రవారం ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాడుబడిన ఇళ్లను తొలగించాలి

మల్దకల్ : మండలంలోని నీలిపల్లి గ్రామంలో పాడుబడిన ఇళ్లను అధికారులు వెంటనే తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. శుక్రవారం గ్రామంలోని పాడుబడిన ఇంటి నుంచి పాములు రావడంతో చుట్టుపక్కల ఇళ్ల ప్రజలు భయాందోళన చెందారు. దీంతో గ్రామస్తులు వెంటనే పంచాయతీ కార్యదర్శితో పాటు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అధికారులు గ్రామంలో పాడుబడిన ఇళ్లను వెంటనే తొలగించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యర్థాలతో చేపల పెంపకం

- కోళ్ల వ్యర్థాలతో విచ్చలవిడిగా సాగు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వైనం
- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు



మొగిలిరావులచెర్వులో కోళ్ల వ్యర్థాలతో పెంచుతున్న చేపలు(ఫైల్)

ఎర్రవల్లి: తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జించాలన్న దురుద్దేశంతో చేపల చెరువుల యజమానులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కుళ్లిన కోడిగుడ్లు, కోడి పేగులు, ఈకలు, కుళ్లిన మాంసం చేపలకు ఆహారంగా వేస్తూ ప్రజలు అనారోగ్యాల బారిన పడేలా చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నా మండంలోని అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విచ్చలవిడిగా చేపల సాగు..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురం, షేకుపల్లి, సాసనూలు, కొండేరు, జింకలపల్లి, మొగిళిరావుల చెర్వు తదితర గ్రామాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా చేపల సాగు చేపట్టారు. చేపలకు మేతగా వేరుశెనగ చెత్త, తవుడు, సోయాబీన్ మిలెడ్‌లను ఉపయోగిస్తుంటారు. సంప్రదాయ మేతను వేయడం వల్ల నెలకు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుంది. ఈ ఖర్చును తగ్గించుకునేందుకు గాను ఎక్కువ రాబడి రావాలన్నా దురుద్దేశంతో కొందరు చేపల చెరువుల యజమానులు చేపలకు కుళ్లిన కోడిగుడ్లతో పాటుగా కోళ్ల వ్యర్థాలను మేతగా వేస్తున్నారు. పట్టపగలే ఆటోలు, వ్యాన్లలో కోళ్ల వ్యర్థాలను కర్నూలు, గద్వాల, వనపర్తి, కొల్లాపూర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి విచ్చలవిడిగా తరలిస్తున్నారు.

మేతగా కోళ్ల వ్యర్థాలు..

సాధారణ మేతను వేయడం వల్ల చేపలు నెలకు అర కేజీ నుంచి కేజీ వరకు మాత్రమే బరువు పెరుగుతాయి. కోళ్ల వ్యర్థాలు, కుళ్లిన కోడిగుడ్లను వేయడం వల్ల చేపలు సాధారణ బరువు కంటే రెండు రెట్లు అధికంగా పెరుగుతాయి. సాధారణ మేతతో పోలిస్తే కోళ్ల వ్యర్థాలు తక్కువ ధరకు వస్తుండటంతో కొందరు చేపల చెరువుల యజమానులు వీటినే అధికంగా వినియోగించి చేపలను పెంచుతున్నారు. చుట్టు పక్కల ప్రాంతాల్లోని చికెన్ షాపుల నుంచి వ్యర్థాలను సేకరించి వాహనాల ద్వారా చెరువుల వద్దకు చేరవేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనలు ఇలా...

కోళ్ల వ్యర్థాలను చేపలకు మేతగా వేయడాన్ని నిషేధిస్తూ 2016లో ప్రభుత్వం జీవో నంబర్ 56ను జారీ చేసింది. ఈ జీవోను అమలు చేసేందుకు మండల స్థాయిలో తహసీల్దార్, మత్స్య అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీఓ), ఎస్‌ఐ, వెహికిల్ ఇన్‌స్పెక్టర్లతో పాటు టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. పట్టుబడ్డ వ్యర్థాలను నాశనం చేయడంతో పాటు డ్రైవర్ లైసెన్స్ రద్దు చేసి వ్యర్థాలతో సాగు చేస్తున్న చేపల చెరువుల రిజిస్ట్రేషన్ రద్దు వంటి చర్యలను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అమలు చేయాల్సి ఉంది. అయితే మండలంలో చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలను వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



కొండేరులో కోళ్ల వ్యర్థాలను చెరువులో వేసిన పెంపకందారులు(ఫైల్)

కఠిన చర్యలు..



చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు వేయడం చట్ట రీత్యా నేరం. ఎక్కడైనా చెరువులలో కోళ్ల వ్యర్థాలను వేసి చేపలను పెంచుతున్నట్లు సమాచారం వస్తే వెంటనే చెరువులపై దాడి చేసి వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటాం.

- నరేందర్, తహసీల్దార్, ఇటిక్యాల

కేసులు నమోదు చేస్తాం..



వాహనాల ద్వారా చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. వ్యర్థాలను తరలిస్తూ వాహనాలు పట్టుబడితే వాటిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తాం. చెరువుల యజమానులు నిబంధనలు పాటించాలి.

- వెంకటేష్, ఎస్‌ఐ, ఇటిక్యాల

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు సురక్షితం



మాట్లాడుతున్న వైద్యురాలు స్వరూపరాణి

మల్దకల్ : ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు సురక్షితమని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. అదే విధంగా గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణి, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్ర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జనవరి మాసంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30 సాధారణ ప్రసవాలు జరిగినట్లు వైద్యులు తెలిపారు. వాటిలో గురువారం ఒక్క రోజే 7 సాధారణ కాన్పులు స్టాఫ్ నర్సు సులోచన చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

బీచుపల్లి ఆలయంలో సినీ నటుడి పూజలు



ఎర్రవల్లి: మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని శుక్రవారం సినీ నటుడు చంద్రశేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

సంపత్‌కుమార్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రవల్లి: పార్టీ కోసం నిరంతరం కృషి చేసిన ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జోగుల రవి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి శ్యామ్ సుందర్‌రావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దశాబ్ద కాలం పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో ప్రలోభాలు పెట్టినా, కేసులు పెట్టినా, ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ జెండాను విడువకుండా పార్టీ కోసం అహర్నిషలు కృషిచేశారన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం గుర్తించి మాదిగ సామాజిక వర్గానికి చెందిన సంపత్‌కుమార్‌ను ఎమ్మెల్సీ స్థానంలో భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలే గుర్తుండిపోతాయి



గద్వాల న్యూటౌన్: ఉద్యోగులు తమ ఉద్యోగ జీవితంలో ప్రజలకు చేసిన సేవలే గుర్తుండిపోతాయని అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావ్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ ఎల్లారెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు నిబద్ధతతో పనిచేసినప్పుడే ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందుతాయన్నారు. ఎల్లారెడ్డి తన 33 ఏళ్ల ఉద్యోగ జీవితంలో బిల్ కలెక్టర్ నుంచి మేనేజర్‌గా పదోన్నతులు పొంది, ఆయా హోదాల్లో చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించారని కొనియాడారు. అనంతరం ఎల్లారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్ డీఈ సందీప్, ఆర్‌ఓ రాజేష్, ఏఈ గోపాల్, మాజీ కౌన్సిలర్లు త్యాగరాజు, శ్రీనివాసులు, ఇసాక్, సుధాకర్ పాల్గొన్నారు.

ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

మల్దకల్ : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, మిషన్ భగీరథ ఏఈ పరమేష్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మల్దకల్ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందు జాగ్రత్తగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. ముఖ్యంగా పైపులైన్ల లీకేజీలను గుర్తించి వాటి మరమ్మతు వెంటనే చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్, సూపరింటెండెంట్ నర్సన్న, సీనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్

అయిజ: జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా పరిషత్, కేజీబీవీ విద్యార్థులకు మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మొత్తం 8 పాఠశాలల నుంచి 25 మంది విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షకు హాజరయ్యారు. లక్ష్మీనారాయణ, చిరంజీవి గౌడ్, బీచుపల్లి, జ్యోతి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓ రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాటల రూపంలో అండగా ఉంటారు



గద్వాలలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాలటౌన్ : అచేతనులకు చైతన్య దీప్తిగా గద్దర్ పాట రూపంలో అండగా వెన్నంటి ఉంటారని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ పూలమాల వేసి నివాళులర్పించారు.

అఖిల పక్షం ఆధ్వర్యంలో..

స్థానిక రాజీవ్ సర్కిల్‌లో అఖిలపక్షం నాయకులు గద్దర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అఖిలపక్ష నాయకులు ప్రభాకర్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఆంజనేయులు, ఏక్బాల్ పాషా తదితరులు గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గద్దర్ జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా పౌరసంబంధాల అధికారి మహమ్మద్ అరీపుద్దీన్ పాల్గొన్నారు. గద్దర్ ఆశయ సాధన పోరుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పల్లయ్య, వాల్మీకి, వినోద్, హుస్సేన్, నర్సింహా, వెంకటన్న పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి ..

అయిజ: మండల కేంద్రంలో శుక్రవారం మాల మహానాడు నాయకులు ప్రజా గాయకుడు గద్దర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివరాజు, కృష్ణ, నాగరాజు, మల్లికార్జున్, నరసింహులు, వీరేష్, శ్రీకాంత్, మహేంద్ర, మునిస్వామి, సురేష్, రవి, పరమేష్, మధు, వీరేష్, తిరుమలేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బైక్.. ఇరువురికి గాయాలు

మానవపాడు : జాతీయ రహదారిపై వెళ్తున్న కారును వెనుక నుంచి బైక్ ఢీకొట్టగా ఇరువురికి గాయాలైన ఘటన శుక్రవారం మండల కేంద్రంలోని బోరవెల్లి స్టేజీ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కర్నూల్ నుంచి హైదరాబాద్ జాతీయ రహదారిపై బోరవెల్లి స్టేజీ సమీపంలో వెళ్తున్న కారును వెనుక నుంచి బైక్ ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న గద్వాల మండలం బసలచెరువుకు చెందిన విజయ్, భరత్ గాయపడ్డారు. క్షతగాత్రులను కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

రైతులను నట్టేట ముంచారు



మల్దకల్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

అయిజ : కాంగ్రెస్ నాయకులు రైతు భరోసా ఇస్తామని నమ్మించి రైతులను నట్టేట ముంచారని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చేందుకు అడ్డగోలుగా హామీలు ఇచ్చిందని, 420 పార్టీగా ముద్ర వేసుకుందన్నారు. జిల్లాలో కేవలం 13 గ్రామాలకు మాత్రమే రైతు భరోసా వేసినట్లు తెలిపారు. రైతులకు వెంటనే రైతు భరోసా నిధులు బ్యాంక్ ఖాతాల్లో జమ చేయకుంటే రైతుల తరుపున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు వీరేష్, ముత్తాలి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం

మల్దకల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు రైతుల పక్షాన పోరాడతామని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మల్దకల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీల్లో రెండు లక్షల రుణమాఫీ, వరి పంటకు ఐదు వందల బోనస్, రైతు భరోసా ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మణ్, కృష్ణ, బజారి, నర్సింహ్మా, తిమ్మప్ప, సుధాకర్, మల్దకల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీలకు సత్కారం



జ్ఞాపిక అందజేస్తున్న కేటీఆర్, ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ : తాజా మాజీలైన బీఆర్‌ఎస్ మున్సిపల్ చైర్మన్‌లు సత్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ మున్సిపల్ చైర్‌పర్సన్, చైర్మన్ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అలంపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, వడ్డేపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, అయిజ మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్‌లు మాల నరసింహ్ములు, శేఖర్ రెడ్డిలను బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే విజయుడు సన్మానించి జ్ఞాపికలు అందజేసినట్లు తెలిపారు. అలంపూర్ మున్సిపాలిటీ ఐదేళ్లలో జాతీయ స్థాయిలో రాష్ట్రపతి అవార్డు, రాష్ట్రంలో రెండు సార్లు అవార్డులు దక్కించుకోవడం ఎంతో గొప్ప విషయమని కేటీఆర్ అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్

ఇటిక్యాల : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోపల్‌దిన్నె గ్రామంలో వివిధ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం కార్యదర్శులు చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా లబ్ధిదారుల ఎంపిక సర్వేను చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామసభలో వివిధ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులు, వారి స్థితిగతులను ఇంటింటికి తిరిగి పరిశీలించాలన్నారు. నిజమైన అర్హులను మాత్రమే ఎంపిక చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రాజశేఖర్, వెంకట నారాయణ, రమేష్, రామకృష్ణ, మద్దిలేటి, శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ల బాధ్యతలు స్వీకరణ

అలంపూర్ : మున్సిపల్ కమిషనర్‌గా చంద్రశేఖర్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలో చంద్రశేఖర్‌రావు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఏఎస్ఓ)గా విధులు నిర్వహించారు. పదోన్నతిపై మున్సిపల్ కమిషనర్‌గా వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు.

అయిజలో..

అయిజ : మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా సీహెచ్ సైదులును గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ పదోన్నతిపై కమిషనర్‌గా అయిజ మున్సిపాలిటీకి నియమించారు. సోమవారం నుంచి విధులకు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యాలయం సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

పీఏసీఎస్ అభివృద్ధికి సహకరించాలి



సూపర్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ మహదేవమ్మ

ధరూరు : పీఏసీఎస్ అభివృద్ధికి సహకరించాలని మండల సింగిల్ విండో చైర్‌పర్సన్ మహదేవమ్మ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ (పీఏసీఎస్) ఆధ్వర్యంలో సూపర్ మార్కెట్‌ను మహదేవమ్మ ప్రారంభించారు. ఆమెతో పాటు మాజీ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ బండ్ల లక్ష్మీదేవమ్మ, మండల పీఏసీఎస్ డైరెక్టర్లు, మాజీ సింగిల్ విండో చైర్మన్ బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ సెక్రటరీ రాజు మాట్లాడారు. పీఏఈసీఎస్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నాణ్యమైన నిత్యావసర సరుకులతో పాటు మార్కెట్ కంటే తక్కువ ధరలకే లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పరమేష్, కాంగ్రెస్ నాయకులు రాజారెడ్డి, సత్యన్న, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

గట్టు : పంచాయతీ కార్మికుల వేతనాలు నెలనెలా సక్రమంగా చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు ఇందువాసి బజారమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం గట్టులోని మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికుల నూతన క్యాలెండర్‌ను ఐఎఫ్‌టీయూ నాయకులు, ఎంపీడీఓ చెన్నయ్య కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బజారమ్మ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జగదీష్, వెంకటన్న, ఎల్లప్ప, సావిత్రి, యోహాను, మారెన్న, కర్రెప్ప, యాకోబు, వెంకన్న ,ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అలంపూర్ : చేనేత త్రిఫ్ట్ నిధుల వ్యవహారంలో జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు నాగేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉండవెల్లి మండలంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు త్రిఫ్ట్ నిధుల కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పథకాలకు తామే అర్హులమని నాయకులే దోచుకోనే స్థితికి వచ్చారని విమర్శించారు. జిల్లా కలెక్టర్, జౌళి శాఖ అధికారులు సమగ్ర విచారణ చేసి అర్హులైన చేనేత కార్మికులకు అందించి న్యాయం చేయాలన్నారు. జిల్లా అధికారులు స్పందించకపోతే బాధితుల తరుపున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేష్, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేస్తే చర్యలు

అలంపూర్ : కళాశాలల్లో ర్యాగింగ్, వేధింపులకు గురి చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని షీటీం సభ్యులు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి కళాశాలలో శుక్రవారం షీటీం బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం బృందం సభ్యులు దివ్యవాణి, లోకేశ్వరీ, శేషన్న, హన్మంతులు మాట్లాడుతూ...మహిళలు రక్షణకు షీటీం ప్రత్యేకంగా పనిచేస్తుందన్నారు. వేధింపులు రకాలు, షీటీంను అప్రోచ్ అయ్యే విధానం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు కోటి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.